# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 298 శనివారం 15 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# బీసీ లెక్కల కోసం..

- ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే!
- ఆ తర్వాతే బీసీ రిజర్వేషన్ల ఖరారు
- ఆ వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు
- సర్వేపై త్వరలో తుది నిర్ణయం
- కులగణన ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందునే!

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకుగాను బీసీల రిజర్వేషన్‌ను ఖరారు చేసేందుకు.. ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సర్వేలో తేలిన లెక్కల ప్రకారం రిజర్వేషన్లపై కసరత్తు చేయాలని భావిస్తోంది. వాస్తవానికి రాష్ట్రంలో కులగణన చేపట్టి.. బీసీల లెక్కలు తేల్చాక.. అందుకనుగుణంగా వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ, కులగణనకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండడం, మరోవైపు స్థానిక ఎన్నికలనూ రాజ్యాంగబద్ధంగా ఐదేళ్లకోసారి నిర్వహించాల్సి ఉండడంతో ప్రభుత్వం ఓటర్ల జాబితా ఆధారిత సర్వే వైపు మొగ్గు చూపిస్తోంది.




2లో


# రుణమాఫీపై మధనం?

- నిధుల కేటాయింపుపై తర్జనభర్జన
- పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టేందుకు కసరత్తు
- నిధుల సేకరణకు ప్రణాళిక రూపొందించాలని ఇప్పటికే ఆర్థిక శాఖ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- పార్లమెంట్ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఆగస్టు పదిహేనులోపు ఒకే విడతలో రుణమాఫీ చేస్తామని హామీ



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రిగా డిసెంబర్‌లోనే బాధ్యతలు చేపట్టినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి మార్చిలో మధ్యంతర బడ్జెట్‌నే ప్రతిపాదించారు. కేంద్రం నుచి వచ్చే గ్రాంట్లు, లోక్ సభ ఎన్నికల తర్వాత పరిస్థితుల్ని బట్టి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టాలనుకున్నారు. ఆ ప్రకారం ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు కూడా పూర్తయిపోవడంతో పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. 2024,-25 సంవత్సరానికి మొత్తం రూ. 2,75,891 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను పార్లమెంట్ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ. 2,01,178 కోట్లు, మూలధన వ్యయం రూ. 29,669 కోట్లుగా పేర్కొంది. ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వం రూ. 53,196 కోట్లు ప్రతిపాదించింది. నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకుంది. జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టి అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఉభయ సభలు ఈ బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఆగస్టు పదిహేనులోపు ఒకే విడతలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రైతు రుణమాఫీకి రూ. 30 వేల కోట్ల నుంచి రూ. 35,000 కోట్ల వరకు అవసరం కానున్నాయి. ఆ మొత్తం నిధులు - మిగతా3లో

# జూలై 22న కేంద్ర బడ్జెట్?

- వచ్చే నెల 3న ఆర్థిక సర్వే
- ప్రభుత్వ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ

లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఎన్డీయే కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో జూలై 22న 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 3న ఆర్థిక సర్వేను పార్లమెంట్ ముందుకు తీసుకొస్తారని తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరి 1న మోదీ సర్కార్ తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాజాగా మరోసారి కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ - మిగతా2లో


# ఎంతటివారైనా ఉపేక్షించం

- లైంగికదాడి నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు పెట్టండి
- డీజీపీకి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- రూపాయి ఖర్చు లేకుండా.. బస్సు ప్రయాణం
- విద్యార్థినులను చూస్తుంటే ఆనందంగా ఉంది



హైదరాబాద్

నారాయణపేట జిల్లా ఉటూర్ మండలంలో గువ్వల సంజీవ్‌ను కొట్టి చంపిన ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. భౌతికదాడులకు దిగి అరాచకాలు, హత్యలకు పాల్పడే శక్తులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తేలితే, బాధ్యులైన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. - మిగతా3లో




## సీబీఐ దర్యాప్తుపై మీ స్పందనేంటి?

- నీట్-యూజీ పరీక్షలో అక్రమాలపై కేంద్రం, ఎన్‌టీఏకు సుప్రీంకోర్టు ప్రశ్న
- 2 వారాల్లోగా తెలియజేయాలని ఆదేశం
- కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం
- నీట్-యూజీలో అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరపాలని పిటిషన్
- ప్రశ్నా పత్రాలు లీక్ కాకపోతే అరెస్టులు ఎందుకు: ఖర్గే
- ఎన్‌టీఏలో లోపాలు ఉంటే సరిదిద్దుతాం: ధర్మేంద్ర ప్రధాన్

# సామాన్యుడిపై ధరాఘాతం

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- 15 రోజుల్లో 60% మేర పెరుగుదల
- రెండింతలైన ఉల్లి, టమాటా రేట్లు
- స్థానికంగా 20% తగ్గిన ఉత్పత్తులు
- 15 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం



హైదరాబాద్

వేసవి రాగానే కూరగాయల ధరలు పెరగడం.. వర్షాకాలం మొదలుకాగానే తగ్గటం మామూలే. కానీ ఈ ఏడాది అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నది. ఎండాకాలంలో ధరలు అంతంత మాత్రంగానే పెరిగినా వర్షాకాలం మొదట్లో రేట్లు అమాంతం కొండెకాయి. ఈ విపరీత పరిస్థితి సామాన్యులకు భారంగా మారింది. ప్రస్తుతం దాదాపు కూరగాయలన్నీ కిలో రూ. 80 వరకు పలుకుతున్నాయి. కేవలం 15 రోజుల వ్యవధిలోనే ఉల్లి, టమాట సహా అన్ని కూరగాయల ధరలు 60 శాతం వరకు పెరిగాయి. మే నెల మూడో వారంలో కిలో రూ. 20 పలికిన ఉల్లి.. ప్రస్తుతం రూ. 50కి చేరింది. - మిగతా3లో

# బీసీ లెక్కల కోసం..



**హైదరాబాద్ :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకుగాను బీసీల రిజర్వేషన్‌ను ఖరారు చేసేందుకు.. ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సర్వేలో తేలిన లెక్కల ప్రకారం రిజర్వేషన్లపై కసరత్తు చేయాలని భావిస్తోంది. వాస్తవానికి రాష్ట్రంలో కులగణన చేపట్టి.. బీసీల లెక్కలు తేల్చాక.. అందుకనుగుణంగా వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ, కులగణనకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండడం, మరోవైపు స్థానిక ఎన్నికలనూ రాజ్యాంగబద్ధంగా ఐదేళ్లకోసారి నిర్వహించాల్సి ఉండడంతో ప్రభుత్వం ఓటర్ల జాబితా ఆధారిత సర్వే వైపు మొగ్గు చూపిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి తాజా ఓటర్ల జాబితాను తీసుకుని, ఆ జాబితాతో సిబ్బందిని గ్రామపంచాయతీల వారీగా ఇంటింటికీ పంపి.. కులాలవారీ లెక్కలు సేకరిస్తారు. గ్రామాల వారీగా ఏ కులం జనాభా ఎంత ఉందో తేలుస్తారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని రెండు మూడు నెలల్లోనే పూర్తిచేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అప్పుడు సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించే వీలుంటుంది. అయితే ప్రస్తుతానికి ఎన్నికల కోసం ఓటర్ల జాబితా ప్రకారం కులాల లెక్కలు తీసినా.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీమేరకు "సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వే"ను విడిగా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

కాగా, సుప్రీంకోర్టు 2010లో ఇచ్చిన తీర్పు ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం తేల్చాల్సిన కులాల లెక్కల్లో మూడు అంశాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. డెడికెటెడ్ కమిషన్ ఏర్పాటు చేయడం, ప్రతి గ్రామం వారీగా కులాల లెక్కలు తీయడం, అన్ని వర్గాలకు కలిపి 50 శాతానికి మించకుండా రిజర్వేషన్ ఉండడం అన్నవి ఈ మూడు అంశాలు. అయితే ఓటర్ల జాబితా ప్రకారం ముందుకెళ్లినా ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టే అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

**బీసీల రిజర్వేషన్ ఎంత?**

ఓటర్ల జాబితా ప్రకారం కులాల లెక్కల తీస్తే.. అన్ని కులాలతోపాటు బీసీల లెక్కలూ తెలుతాయి. దానిని బట్టి వారికి ఎంతశాతం రిజర్వేషన్ కల్పించాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే గత బీఆర్ఎస్ సర్కారు 2018లో పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేసింది. అందులో.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చూసే క్రమంలో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించింది. ఆ విధానంలోనే 2019లో స్థానిక ఎన్నికలు నిర్వహించింది. అయితే బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి ఎన్నికలు నిర్వహించడంపై హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు వాటిని విచారించిన సమయంలో 2024లో జరిగే స్థానిక ఎన్నికల్లో సుప్రీం మార్గదర్శకాలను అమలు చేస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయస్థానానికి చెప్పింది. దీంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. అందుకోసం రాష్ట్రంలోని బీసీల జనాభాను తేల్చి వారి శాతాన్ని ఖరారు చేయాల్సి ఉంటుంది.

**రిజర్వేషన్ల అంశంతో ఆలస్యంగా ఎన్నికలు..**

నిజానికి సర్పంచ్‌ల పదవీకాలం ఈ జనవరిలోనే ముగిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం జూలై మొదటివారంతో ముగియనుంది. దీంతో ఈలోపే ఎన్నికలు నిర్వహించి కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంది. కానీ, రిజర్వేషన్ల అంశం తెరపైకి రావడంతో ఎన్నికలు సమయానుకూలంగా జరగడంలేదు. అయితే 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు.. బీసీ కార్పొరేషన్ ద్వారా సేకరించిన గణాంకాలు, 2000వ సంవత్సరంలో నాటి సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన మల్టీపర్పస్ హౌస్‌హోల్డ్ సర్వే (ఎంపీహెచ్ఎస) ప్రకారం.. అప్పటి పరిస్థితులు, జనాభా ఆధారంగా బీసీలకు అవకాశం కల్పిస్తూ వచ్చారు. ఈ గణాంకాలు, జనాభా పెరుగుదల ఆధారంగా ఆ తరువాత కూడా రిజర్వేషన్లు అమలుచేస్తూ వచ్చారు. 2004లో సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌ను వర్తింపజేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, అమల్లోకి తీసుకువచ్చారు. అయితే దేశంలోని వివిధ రాష్ట్రాలు ఎవరికి వారు రిజర్వేషన్లను పెంచుతూ పోవడంతో.. అసలు బీసీలకు రిజర్వేషన్ ఎంత అన్నది తేల్చాలనే వాదనలు తలెత్తాయి. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి మొత్తం 50 శాతం రిజర్వేషన్ మించకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ వర్తిస్తుండడడంతో బీసీలకు రిజర్వేషన్ శాతం తగ్గిపోయింది. దీంతో తమకు కూడా జనాభా దామాషా ప్రకారమే రిజర్వేషన్లను వర్తించాలనే డిమాండ్‌ను బీసీలు తెరపైకి తెచ్చారు.

**ఓటర్ల జాబితాతో సర్వే ఇలా..**

స్థానిక ఎన్నికలను కొత్త ఓటర్ల జాబితా ప్రకారం నిర్వహించాలంటే.. మొదట పంచాయతీరాజ్ శాఖ అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి సవరించిన ఓటర్ల జాబితాను తీసుకోవాల్సి ఉంటుంది. ఆ జాబితా ఆధారంగా గ్రామ, వార్డు, మండలాల వారీగా ఉన్న కులాల వివరాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియలో ఇతర కులాలతోపాటు బీసీలు ఎంతమంది ఉన్నారు, ఇప్పటివరకు ఎంతమేర రాజకీయ ప్రాతినిధ్యం లభించిందనే విషయంతోపాటు రాజకీయంగా ఎంతమేర వెనుకబాటుతనానికి గురయ్యారనే వివరాలను కూడా సేకరిస్తారు. ఈ వివరాలన్నింటినీ క్రోడీకరించి బీసీ కమిషన్‌కు సమర్పిస్తారు. బీసీ కమిషన్ వాటిని పరిశీలించి బీసీలకు ఎంతమేర రిజర్వేషన్ కల్పించాలనే దానిపై ప్రభుత్వానికి సూచన చేస్తుంది. అయితే.. కమిషన్ ఎంత శాతాన్ని సూచించినా.. ప్రభుత్వం మాత్రం 50శాతం రిజర్వేషన్ నిబంధనకు లోబడే నడచుకోవాల్సి ఉంటుంది.

**రిజర్వేషన్లు మారే అవకాశం..**

ఓటర్ల జాబితా ప్రకారం నిర్వహించబోయే ఎన్నికల్లో ఈసారి గ్రామాలు, వార్డుల వారీగా రిజర్వేషన్లు మారే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది. వాస్తవానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో చేసిన సవరణల ప్రకారం.. ప్రతి పదేళ్లకోసారి మాత్రమే రిజర్వేషన్లు మారుతాయి. కానీ, గత ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్‌ల విషయంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ఈ మార్పులు చేస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ రిజర్వేషన్లకు సంబంధించి కులసంఘాలు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది.

# సీబీఐ దర్యాప్తుపై మీ స్పందనేంటి?




**న్యూఢిల్లీ :** నీట్-యూజీ పరీక్షలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పరీక్ష ప్రశ్నాపత్రం లీక్, అక్రమాలపై హితేన్ సింగ్ కశ్యప్‌తో పాటు మరికొందరు సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ జరిపింది. ఇది 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయమని, సీబీఐ విచారణ జరిపించాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టును కోరారు. అయితే, ఈ విషయాన్ని తాము అర్థం చేసుకున్నామని, అన్ని అంశాలు తమ దృష్టిలో ఉన్నాయని కోర్టు పేర్కొన్నది. ఈ సందర్భంగా నీట్ పరీక్ష శిక్షణకు కేంద్రంగా ఉన్న రాజస్థాన్ లోని కోటాలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలను న్యాయవాది ప్రస్తావించగా కోర్టు అడ్డుకుంది. అనవసరమైన భావోద్వేగ వాదనలు చేయవద్దని, నీట్ ఫలితాల వల్ల కోటాలో ఆత్మహత్యలు జరగడం లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్ పేర్కొన్నారు. సీబీఐ విచారణ జరిపించడంపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్రం, ఎన్‌టీఏతో పాటు సీబీఐ, బీహార్ ప్రభుత్వాన్ని ఆదేశించిన కోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. ఈ కేసును జూలై 8న సాధారణ ధర్మాసనం విచారిస్తుందని తెలిపింది.

**అన్ని పిటిషన్లు సుప్రీంకోర్టుకు బదిలీ చేయండి: ఎన్‌టీఏ**

నీట్-యూజీ పరీక్షపై వేర్వేరు హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాల్సిందిగా ఎన్‌టీఏ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం వెకేషన్ బెంచ్ విచారించింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాల్సిందిగా హైకోర్టులను ఆశ్రయించిన పిటిషన్‌దారులను ఆదేశించింది. మొత్తం పిటిషన్లు అన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ఎన్‌టీఏ తరపున న్యాయవాది కోర్టును కోరారు.

**మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారు?: ఖర్గే**

నీట్-యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కాకపోతే బీహార్‌లో 13 మందిని పేపర్ లీక్ చేశారని ఎందుకు అరెస్టు చేశారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రాన్ని ప్రశ్నించారు. పేపర్లు ఇచ్చిన ముఠాకు రూ.30 %-% రూ.50 లక్షలు అందిన వైనాన్ని పట్నా పోలీసులు బయటపెట్టలేదా అని అడిగారు. గుజరాత్‌లోని గోద్రాలోనూ నీట్-యూజీ చీటింగ్ రాకెట్ పట్టుబడలేదా? అని ప్రశ్నించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎన్‌టీఏ ద్వారా నీట్ కుంభకోణాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం మోదీ ప్రభుత్వం చేస్తున్నదని ఆరోపించారు.

**అక్రమాలను ఉపేక్షించబోం: ప్రధాన్**

పరీక్షల నిర్వహణలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌ను, అక్రమాలను తమ ప్రభుత్వం ఉపేక్షించబోదని, ఎన్‌టీఏ జవాబుదారీతనానికి సంబంధించి ఏమైనా లోపాలు గుర్తిస్తే సరిదిద్దుతామని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ ఏడాది సిలబస్ తక్కువ కావడం, అభ్యర్థుల సంఖ్య పెరగడం వల్ల పోటీ పెరిగిందని, టాప్ ర్యాంకర్లు పెరిగారని ఆయన స్పష్టత ఇచ్చారు.

**'నీట్' ఒక కుంభకోణం: స్టాలిన్**

విద్యను మాత్రమే ఎవరూ దొంగలించలేరని, అయితే ఇప్పుడు నీట్ లాంటి పరీక్షల్లోనూ కుంభకోణాలు జరుగుతున్నాయని, దీనిని బలంగా వ్యతిరేకించాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. నీట్ అనేది ఒక కుంభకోణం అని తమిళనాడు మొదట చెప్పిందని, ఇప్పుడు దేశమంతా చెప్తున్నదని ఆయన అన్నారు.

## అగ్ని ప్రమాదమంటూ వదంతి..

## రైల్లో నుంచి దూకేసిన ప్రయాణికులు

**ధన్‌బాద్ :** రైలు బోగీలో నిప్పంటుకుందన్న వదంతి ముగ్గురు ప్రయాణికుల ప్రాణాలను బలిగొంది. అగ్నిప్రమాద భయంతో ససారం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నుంచి బయటకు దూకిన ప్రయాణికుల్లో ముగ్గురు అదే సమయంలో పక్క పట్టాలపై వస్తున్న గూడ్స్ రైలు కింద పడి మరణించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 8 గంటలకు జార?ండ్‌లో చోటుచేసుకుంది. రాంచీ-ససారం ఎక్స్‌ప్రెస్ ధన్‌బాద్ డివిజన్‌లోని కుమందిహ్ రైల్వే స్టేషన్ వద్దకు చేరుకున్న సమయంలో రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుందని కొందరు వదంతి రేపారు. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. కొందరు ప్రయాణికులు ప్రాణభయంతో నడుస్తున్న రైలు నుంచి కిందకు దూకేశారు. అదే సమయంలో పక్కనున్న పట్టాలపై గూడ్స్ రైలు వస్తుండటంతో దాని కింద నలిగి ముగ్గురు మరణించారు. రైలులో అగ్నిప్రమాదం జరిగినట్టు గుర్తు తెలియన వ్యక్తి నుంచి కుమందిహ్ స్టేషన్‌కు ఫోన్ వచ్చిందని ధన్‌బాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ తెలిపారు. దీంతో రైలును ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి ప్రమాదం జరగలేదని, కేవలం వదంతి మాత్రమేనని తెలిసిందన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం మావోయిస్టుల ప్రభావం ఉన్న ఏరియా కావడంతో, దీని వెనుక ఉగ్రవాద కోణం ఏమన్నా ఉందా అన్న విషయాన్ని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి ఆత్మాహుతి డ్రోన్

న్యూఢిల్లీ, జూన్ 14: భారత సైన్యం అమ్ములపొదిలోకి మరో అత్యాధునిక ఆయుధం చేరింది. ఆయుధ, రక్షణ వ్యవస్థ స్వావలంభనలో భాగంగా దేశీయంగా తొలిసారిగా అభివృద్ధి చేసిన సూసైడ్(ఆత్మాహుతి) డ్రోన్ 'నాగాస్త్ర-1' ఆర్మీ చేతికి అందింది. 9 కిలోల బరువు ఉండే ఈ డ్రోన్‌ను మనిషి మోసుకెళ్లేలా రూపొందించారు. కామికేజ్ మోడ్‌లో(శత్రు స్థావరాలు, లక్ష్యాలపై డ్రోన్‌ను సొంతంగా కూల్చివేయడం) పనిచేయడం ద్వారా ఈ నాగాస్త్ర శత్రువుల ముప్పును సమర్థంగా నిలువరించగలుగుతుందని ఆర్మీ వర్గాలు చెబుతున్నాయి. నాగాస్త్ర-1ను మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని సోలార్ ఇండస్ట్రీస్ కంపెనీ అభివృద్ధి చేసింది. 'నాగాస్త్ర-1' ప్రత్యేకతలు: బరువు- 9 కిలోలు, 1 కిలో పేలుడు పదార్థాలు మోసుకెళ్లే సామర్థ్యం %శ్రీ% పరిధి- 15-30 కిలోమీటర్లు %శ్రీ% 200 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో కనిపించదు %శ్రీ% జీపీఎస్ వినియోగంతో కచ్చితమైన దాడులు %శ్రీ% లక్ష్యంపై దాడి కచ్చితత్వం- 2 మీటర్లు %శ్రీ% 24 గంటల నిఘా కెమెరాలు.

## ఆర్మీ చేతికి నాగాస్త్ర-1

**దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి ఆత్మాహుతి డ్రోన్**




**న్యూఢిల్లీ :** భారత సైన్యం అమ్ములపొదిలోకి మరో అత్యాధునిక ఆయుధం చేరింది. ఆయుధ, రక్షణ వ్యవస్థ స్వావలంభనలో భాగంగా దేశీయంగా తొలిసారిగా అభివృద్ధి చేసిన సూసైడ్(ఆత్మాహుతి) డ్రోన్ 'నాగాస్త్ర-1' ఆర్మీ చేతికి అందింది. 9 కిలోల బరువు ఉండే ఈ డ్రోన్‌ను మనిషి మోసుకెళ్లేలా రూపొందించారు. కామికేజ్ మోడ్‌లో(శత్రు స్థావరాలు, లక్ష్యాలపై డ్రోన్‌ను సొంతంగా కూల్చివేయడం) పనిచేయడం ద్వారా ఈ నాగాస్త్ర శత్రువుల ముప్పును సమర్థంగా నిలువరించగలుగుతుందని ఆర్మీ వర్గాలు చెబుతున్నాయి. నాగాస్త్ర-1ను మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని సోలార్ ఇండస్ట్రీస్ కంపెనీ అభివృద్ధి చేసింది.

## జూలై 22న కేంద్ర బడ్జెట్?

**-మొదటిపేజీ తరువాయి**

ఈనెల 12న సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. 2024-25 బడ్జెట్‌కు సంబంధించిన కసరత్తు ప్రారంభించాలని ఆమె అధికారులను ఆదేశించినట్టు సమాచారం. మరోవైపు సీతారామన్ నేతృత్వంలో ఈనెల 22న ఢిల్లీలో 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని జీఎస్టీ కౌన్సిల్ గురువారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది.

## చార్‌ధామ్ దర్శనాలపై ఆంక్షల తొలగింపు



**న్యూఢిల్లీ:** చార్‌ధామ్ దేవాలయాలను రోజువారీ సందర్శించే భక్తుల సంఖ్యపై పరిమితిని ఉత్తరాఖండ్ ప్రభుత్వం తొలగించింది. కొద్ది రోజుల నుంచి ఈ యాత్ర సజావుగా, సాధారణ స్థితిలో కొనసాగుతుండటంతో శుక్రవారం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భక్తు లు రిషికేశ్, హరిద్వార్‌లలోని రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్దకు వెళ్లి నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి దేవాలయాలను సందర్శించవచ్చు. ఈ దేవాలయాలను సందర్శించాలనుకునే భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో ఏప్రిల్‌లో రోజువారీ రిజిస్ట్రేషన్లపై పరిమితిని విధించిన సంగతి తెలిసిందే.


## ఆర్మీ అమ్ముల పొదిలో నాగాస్త్రం

**తొలి విడతలో సైన్యానికి చేరిన 120 డ్రోన్లు**

**న్యూఢిల్లీ :** రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక ముందడుగు పడింది. తొలిసారి స్వదేశీయంగా రూపొందించిన ఆత్మాహుతి డ్రోన్ నాగాస్త్ర-1 భారత ఆర్మీ అమ్ములపొదిలో చేరింది. నాగ్‌పూర్‌లోని సోలార్ ఇండస్ట్రీసకు చెందిన ఎకనామిక్స్ ఎక్స్‌ప్లోజివ్ లిమిటెడ్ (ఈఈఎల్) ఈ యూఏవీ (మానవ రహిత విమానం) డ్రోన్లను తయారు చేసింది. తొలి విడతలో భాగంగా 120 డ్రోన్లను ఆర్మీకి అందించింది. పుల్గావ్‌లోని డిపోకు వాటిని తరలించారు. 9 కేజీల బరువుండే ఈ పోర్టబుల్ డ్రోన్ గాలిలో ఏకధాటిగా 30 నిమిషాలు ఎగరగలదు. ఒక కేజీ బరువున్న పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. జీపీఎస్ ఆధారంగా పనిచేసే ఈ డ్రోన్ కామకేజ్ మోడ్‌లో అత్యుత్తమంగా పనిచేస్తుంది. లక్ష్యాలపై కచ్చితత్వంతో దాడిచేస్తుంది. ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్ కారణంగా నాగాస్త్ర-1 తక్కువ శబ్దంతో ప్రయాణిస్తుంది. ఇది 200 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఎగిరితే శత్రువుకు దీన్ని గుర్తించడం కూడా కష్టమే. దీనిలో పగలు, రాత్రి పనిచేసేందుకు వీలుగా నిఘా కెమెరాలు ఉన్నాయి.

## బండి సంజయ్‌కి శుభాకాంక్షలు

## తెలియజేసిన సాయిరాం గౌడ్



**న్యూ ఢిల్లీ :** ఢిల్లీలోని అధికార నివాసంలో కేంద్రమంత్రివర్యులు బండి సంజయ్ ని భాజపా యువమోర్చ జాతీయ నాయకులు రాగిరి సాయిరామ్ గౌడ్ కలిసి అభినందనలు తెలిపారు. బండి సంజయ్ కి సముచిత స్థానం కల్పించినందుకు పార్టీ అధ్యక్షులు జేపీ నడ్డా, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, ప్రధాని మోడీ కి సాయిరాం గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సామాన్యుడిపై ధరాఘాతం

-మొదటిపేజీ తరువాయి

ఇక, టమాటా ధర కూడా రెండింతలు పెరిగి, ప్రస్తుతం కిలో రూ.50కిపైగా పలుకుతున్నది. ఇక వంకాయలు, బీన్స్, క్యారట్ ఇతర కూరగాయలతో సహా ఆకుకూరల ధరలు కూడా భారీగా పెరిగాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా సరిపడా ఉల్లి మార్కెట్‌కు రాకపోవడమే ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో హైదరాబాద్‌కు రోజూ 8 వేల క్వింటాళ్ల ఉల్లిగడ్డ వస్తే ప్రస్తుతం 5 వేల క్వింటాళ్ల వరకే వస్తున్నది. ధరలు తగ్గించే విధంగా ప్రభుత్వం ప్రణాళికలను అమలు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. డిమాండ్‌ను అంచనా వేసి ఆ మేరకు నిల్వలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గత నెల బావుల, బోర్ల కింద కూరగాయాల పంటలు వేశారని, ఆ పంట దిగుబడి మొదలైతే, వచ్చే రెండు నెలల్లో ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నదని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు.



### తగ్గిన ఉత్పత్తి

తెలంగాణ జనాభాకు ప్రతి ఏడాది 38.54 లక్షల టన్నుల కూరగాయలు అవసరమవుతాయని ఒక అంచనా. అయితే ప్రస్తుతం 19.54 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్రంలో 1.30 కోట్లకు పైగా ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగవుతున్నాయి. అందులో కూరగాయల పంటలు 3.11 లక్షల ఎకరాలకే పరిమితమయ్యాయి. ఈ కారణంగా జనాభా అవసరాలను సుమారు 19 లక్షల టన్నుల దిగుబడుల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తున్నది.

### 15 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

హైదరాబాద్, జూన్ 14 (స్పెషల్ టాస్క్ బ్యూరో, నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్ర మోదీ అసమర్థ విధానాలు, అనాలోచిత నిర్ణయాలతో సామాన్యుడిపై ధరాఘాతం పెను ప్రభావం చూపిస్తున్నది. వంట గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ పెంపుతో ప్రజలు ఒకవైపు అల్లాడిపోతుంటే.. నిత్యావసరాల ధరలు వారిపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. దీన్ని రుజువు చేస్తూ.. మే నెలలో టోకు ద్రవ్యోల్బణం 2.61 శాతానికి పెరిగింది. గడిచిన 15 నెలల వ్యవధిలో ఇదే గరిష్ఠం. ఈ మేరకు కేంద్రప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తున్నది.

### రాకెట్ వేగంతో టీవోపీ ధరలు

అరకొర సంపాదనతో బతుకుబండి లాగిస్తున్న సామాన్యులకు టీవోపీ (టమాట-ఆనియన్ (ఉల్లిగడ్డ)-పొటాటో (ఆలుగడ్డ)) ధరలు ఆకాశాన్నంటడం నిద్రలేకుండా చేస్తున్నది. వంటకు ప్రధానమైన ఈ మూడు కూరగాయల ధరలు అమాంతం పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ అదుపుతప్పుతున్నది. ఈ నెలలోనే ఉల్లిగడ్డల ధరలు 21 శాతం, టమాటా ధరలు 36 శాతం, ఆలుగడ్డల ధరలు 20 శాతం, వంట నూనెల ధరలు 15 శాతం పెరిగినట్టు క్వాంట్‌ఈకో రీసెర్చ్ సంస్థ తెలిపింది. 'వడగాలులు, అకాల వర్షాల నేపథ్యంలో ఉల్లి, టమాట దిగుబడిపై ప్రభావం పడింది. దీంతో మార్కెట్లోకి వచ్చే ఉల్లి, టమాట దిగుబడి భారీగా తగ్గిపోయింది. వచ్చేది పండుగల సీజన్. దీన్ని దృష్టిలో పెట్టుకొన్న రైతులు.. తమ పంటను విపణిలోకి తీసుకురావడాన్ని ఆలస్యం చేస్తున్నారు. భవిష్యత్తులో ఎక్కువ ధర వస్తుందనే వాళ్లు ఇలా చేస్తున్నారు. వెరసి డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో టమాట, ఉల్లిగడ్డలు, ఆలుగడ్డల ధరలు భారీగా పెరుగుతున్నాయి' అని క్వాంట్‌ఈకో రీసెర్చ్ సంస్థ వెల్లడించింది. టీవోపీ ధరలు ప్రతీనెలా 5.2 శాతం మేర పెరుగుతున్నట్టు హెడీఎఫ్‌సీ బ్యాంక్ ఇటీవల ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇదే సమయంలో ప్రతీనెలా పప్పు దినుసులు 1.7 శాతం మేర పెరుగుతున్నట్టు వివరించింది. నిత్యావసరాల ధరలను కట్టడి చేయడంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఆ భారం తమపై పడుతున్నదని మోదీ సర్కారుపై సామాన్యులు మండిపడుతున్నారు.

### మే వరకు అదుపులోనే ధరలు..

ఈసారి వేసవిలో స్థానికంగా కూరగాయల ఉత్పత్తి 20 శాతం వరకు తగ్గింది. డిమాండ్‌ను బట్టి వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దయెత్తున దిగుమతి చేసుకున్నారు. అందుకే మే వరకు ధరలు దాదాపు అదుపులోనే ఉన్నాయి. ఈ నెల మొదటి వారంలో వర్షాలు మొదలయ్యాక సమస్యలు ప్రారంభమయ్యాయి. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న సమయంలో వర్షాలు పడడం వల్ల అవి తడిసిపోవడం, కుళ్లిపోవడం వంటి పరిణామాల దృష్ట్యా కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. హైదరాబాద్ నగర జనాభాకు ప్రతి రోజు దాదాపు 3,300 టన్నుల కూరగాయల అవసరం ఉంటుంది. కానీ వారం రోజులుగా అన్ని హోల్‌సేల్ మార్కెట్లకు 2,800 టన్నుల సరకు మాత్రమే వస్తున్నది. మరోవైపు ధరలు పెరిగిన నేపథ్యంలో కొనుగోళ్లు పెద్దగా జరుగడం లేదని, దీంతో ఉన్న సరుకు పాడైపోయి, పెట్టుబడి కూడా రావడం లేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అందుకే పెరిగింది!

'2024 మే నెలలో ఆహార పదార్థాలు, ఆహార ఉత్పత్తుల తయారీ, ముడి చమురు, సహజ వాయువు, నూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఈ ప్రభావం నిత్యావసరాలు, కూరగాయలపై పడింది. ఫలితంగా టోకు ద్రవ్యోల్బణం 2.61 శాతానికి పెరిగింది.

# ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కేసులు

**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జస్టిస్ నరసింహా రెడ్డి నేతృత్వంలోని కమిషన్ నోటీసులు**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయగానే విద్యుత్ కొనుగోలు అంశంపై దృష్టి**

**కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపణ**

**ఇప్పటికే కీలక దశకు చేరుకున్న ఫోన్ ట్యాపింగ్ కేసు**



హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జస్టిస్ నరసింహా రెడ్డి నేతృత్వంలోని కమిషన్ నోటీసులు పంపింది. ఆయన పదవీకాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో (పీపీఏ) ప్రమేయంపై వివరణ కోరుతూ నోటీసు జారీ చేసింది. జూన్ 15లోగా సమాధానం ఇవ్వాలని కమిషన్ సూచించింది. దీనిపై స్పందించిన కేసీఆర్ జులై 30 వరకు గడువు కావాలని కమిషన్ కి విజ్ఞప్తి చేశారు. కానీ సమయం ఇచ్చేందుకు కమిషన్ అంగీకరించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయగానే విద్యుత్ కొనుగోలు అంశంపై దృష్టి పెట్టింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించింది. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశాలు ఇచ్చింది. అదులో భాగంగా జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ను ఏర్పాటు చేసింది. యాదాద్రి, దామరచర్ల విద్యుత్ ప్లాంట్లకు సంబంధించిన ఒప్పందాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పీపీఏలలో జరిగిన అవకతవకలపై జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ దర్యాప్తు చేస్తోంది. విచారణలో ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ప్రతిపాదన కూడా ఉంది. మాజీ సీఎం స్పందన సంతృప్తికరంగా లేకుంటే వ్యక్తిగత హాజరు ప్రక్రియను ప్రారంభిస్తామని కమిషన్ హెచ్చరించింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో పాటు భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టులకు సంబంధించి పీపీఏలో జరిగిన అవకతవకలను వెలికితీయాలని జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ దృష్టి సారించింది. మరో వైపు కాళేశ్వరపై విచారణ ఊపందుకుంది. ఈ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ పై అనేక ఆరోపణలను అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ చేశాయి. బీజేపీ సీబీఐ విచారణకు డిమాండ్ చేసింది. అయితే ఇందులో అవినీతిని తామే తేలుస్తామని కాళేశ్వరంపై ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను నియమించారు. నిర్మాణపరమైన అంశాలపై ఏజెన్సీలను పిలిచి విచారణ చేస్తున్నారు జస్టిస్ పీసీ ఘోష్. నిజాలు తెలుసుకునేందుకు అందరి వద్ద సమాచారం సేకరిస్తున్నట్టు ఘోష్ తెలిపారు. జూన్ 30వ తేదీలోపు విచారణ పూర్తి కాదని ఇంకా సమయం పడుతుందని చెప్పారు. అసలు విషయాలు తెలుసుకోకుండా పూర్తి నివేదిక ఇవ్వలేమని అటున్నారు. టెక్నికల్ అంశాల విచారణ పూర్తి అయ్యాక, ఆర్థిక అంశాల పై విచారణ మొదలు అవుతుందని చెప్పారు. ప్రభుత్వం వద్ద నుంచి రిపోర్టులు అన్ని అందాయని అంటున్నారు. ఈ విషయంలోనూ కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక దశకు చేరుకుంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో రి మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పేరు వెలుగులోకి వచ్చింది. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు, పార్టీలో ఆయన సన్నిహితుల వ్యవహారాలను చక్కబెట్టేందుకే తామంతా కలిసి పనిచేశామని టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రణీత్‌కుమార్ అందించే వివరాలతో.. కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థులను, వారికి ఆర్థిక సాయం అందించేవారిని బెదిరించి లొంగదీసుకునేవారమని, సివిల్ తగాదాల్లో సెటిల్మెంట్లు చేసేవారమని, ఎన్నికల్లో వారి నగదు తరలింపును అడ్డుకునేవారమని చెప్పారు. బీఆర్ఎస్ డబ్బు రవాణాకు సహకరించేవారమని తెలిపారు. ఇప్పటికీ ఈ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, ఓ టీవీ చానల్ అధినేత శ్రవణ్ రావులను ఇండియా రప్పించేందుకు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేస్తున్నారు. నిన్నటి వరకూ ఎన్నికల కోడ్ ఉంది. ఇప్పుడు కోడ్ లేదు. పూర్తి పాలన రేవంత్ చేతుల్లోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాజకీయం కూడా మారిపోయింది. బీఆర్ఎస్ పూర్తిగా వెనుకబడిపోయింది. ఒక్క ఎంపీ సీటు కూడా తెచ్చుకోలేకపోయింది. కవిత జైల్లో ఉన్నారు. ఇలాంటి సమయంలో కేసీఆర్ ను కూడా కేసులతో ఉక్కిరిబిక్కిరి చేస్తే.. ఇక పార్టీ కోలుకోవడానికి అవకాశం ఉండదన్న వ్యూహంతో కాంగ్రెస్ పార్టీ ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రాజకీయ విమర్శలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి ఈ కేసుల్లో వెనక్కి తగ్గే అవకాశం ఉండదు. ఎందుకంటే పదేళ్ల పాటు ఆయన కేసీఆర్ ప్రభుత్వంలో ఎన్నెన్నో కేసులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు కేసీఆర్ ను ఆ స్థాయిలో టార్గెట్ చేయడానికి అన్ని ఆధారాలు ఉన్నప్పుడు ఎందుకు వదలాలనే ప్రశ్న వస్తుంది. అందుకే వచ్చే కొద్ది రోజుల్లో కేసీఆర్ మరిన్ని తీవ్రమైన విచారణలు ఎదుర్కోవాల్సి వచ్చేలా ఉంది.

## కొలువులివ్వండి కాల్మొక్త!

**ప్రజావాణిలో కాంగ్రెస్ నేత కాళ్లపై పడిన యువతి**

**గ్రూప్-1 మెయిన్‌కు 1:100 నిష్పత్తిలో పిలవాలని వినతి**

**గ్రూప్ 2, 3 పోస్టులు పెంచి నిరుద్యోగులను ఆదుకోండి**

**హామీ ఇవ్వని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి**

**ఇది రాకపోతే, మరో పరీక్ష రాసుకోండని ఉచిత సలహా**

చిన్నారెడ్డి కాళ్ల మీద పడింది. మెయిన్ పరీక్షలకు 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రూప్-2లో రెండు వేలు, గ్రూప్-3లో మూడు వేల చొప్పున పోస్టులు పెంచాలని ప్రాధేయపడింది. అయినప్పటికీ, చిన్నారెడ్డి నుంచి వారికి ఎలాంటి హామీ లభించలేదు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి నిరుద్యోగులతో మాట్లాడుతూ.. 'ప్రస్తుత ఉద్యోగ నోటిఫికేషన్ పరీక్షలు రాసుకోండి. ఈ నోటిఫికేషన్ ద్వారా మీకు ఉద్యోగాలు రావా? రాకపోతే మరో నోటిఫికేషన్ వస్తుంది. దానికి ప్రిపేర్ అవండి' అంటూ ఉచిత సలహా ఇచ్చారు. రాష్ట్రంలో వచ్చే నాలుగేండ్లలో 30 లక్షల మందికి స్కిల్స్ నేర్పించి, మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పారు. అంతేతప్ప నిరుద్యోగుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించలేదు. దీంతో నిరుద్యోగులు ఒక్కసారిగా హతశులయ్యారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలేమిటి? ఇప్పుడు మాట్లాడుతున్నదేమిటి? అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో సీఎల్పీ నేతగా వ్యవహరించిన ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సైతం గ్రూప్-1 మెయిన్‌కు 1:100 నిష్పత్తిలో అవకాశం కల్పించాలని అసెంబ్లీలో కోరారని నిరుద్యోగులు గుర్తుచేస్తున్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీ సాక్షిగా చేసిన డిమాండ్‌ను నేడు అధికారంలో ఉండి కూడా నెరవేర్చకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

### 1:100 ఎందుకంటే..

వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొలిసారిగా 503 పోస్టుల భర్తీకి గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలైంది. నాడు భారీ నోటిఫికేషన్ వెలువడటంతో ఎన్నో ఆశలతో లక్షలాది నిరుద్యోగులు పరీక్షలకు హాజరయ్యారు. గ్రూప్-1 పరీక్ష పేపర్ లీక్ అవ్వడం, ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆ నోటిఫికేషన్‌నే రద్దు చేశారు. గ్రూప్-1 పరీక్షల కోచింగ్‌ల కోసం ఎంతో ఖర్చు చేసిన చాలామంది అభ్యర్థులకు మరోసారి పరీక్ష నిర్వహణ ఆర్థికంగా భారంగా పరిణమించింది. కొంతమందికి ఉద్యోగార్హత వయసు కూడా దాటిపోతున్నది. సుదీర్ఘకాలం నిరీక్షించలేక కొందరు ఏదో ఒక పనిలో చేరిపోయారు. ఈ నేపథ్యంలో గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలకు అభ్యర్థులు సరిగా ప్రిపేర్ కాలేకపోయారు. కొందరు నిరుద్యోగులు కాం గ్రెస్ తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా, ఇన్ సర్వీస్ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు.

### ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం : తెలంగాణ నిరుద్యోగ యువత

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి, ఓటర్ల కాళ్లు పట్టుకుని మరీ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని ప్రచారం చేశామని నిరుద్యోగులు గుర్తుచేసుకుంటున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## ఎంతటివారైనా ఉపేక్షించం

-మొదటిపేజీ తరువాయి

పెద్దపల్లి జిల్లాలో ఆరేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడి హత్యచేసిన ఘటనపై తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.



### రూపాయి ఖర్చు లేకుండా.. బస్సు ప్రయాణం

మహిళల కోసం తాము అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో విద్యార్థినులు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయడం చూస్తుంటే సంతోషంగా ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం, మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఈ బాలికలను చూస్తుంటే ఆనందంగా ఉంది. ఊరికి కిలోమీటర్ దూరాన ఉన్న పాఠశాలకు రూపాయి ఖర్చు లేకుండా వెళ్లగలుగుతున్నారు. ప్రజాప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం వల్ల మేం ఉచితంగా బస్సెక్కి స్కూలుకు వెళ్లగలుగుతున్నాం అని తమ చేతిలోని ఆధార్ కార్డులు చూపిస్తూ వాళ్లంతా సంతోషం వ్యక్తం చేస్తుంటే.. ఓ జర్నలిస్టు మిత్రుడు ఫొటో తీసి పంపారు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## రుణమాఫీపై మధనం?

-మొదటిపేజీ తరువాయి

కేటాయించి బడ్జెట్ రూపొందించాల్సి ఉంది. నిధుల సేకరణకు ప్రణాళిక రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో, ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఒక్క రుణమాఫీకే అంత మొత్తం కేటాయిస్తే ఇతర పథకాలపై ప్రభావం పడుతుంది. అందుకే ఇతర పథకాలపై ప్రభావం పడకుండా రుణమాఫీ చేయడంపై కసరత్తు చేస్తున్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే హామీల అమలుకు సమస్యలు ఉండవని రేవంత్ రెడ్డి భావిస్తూ వస్తున్నారు. అయితే అనుకున్నట్లుగా ఇండియా కూటమి అధికారంలోకి రాలేదు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు తప్ప కొత్తగా ఎలాంటి ఆదాయం ఉండదని స్పష్టమయింది. ఇప్పుడు అన్ని పథకాలతో పాటు రుణమాఫీకి నిధులు కేటాయించడం పెద్ద సవాల్‌గా మారనుంది. మద్యం ధరలు పెంచడం, భూముల విలువలు పెంచడం వంటి వాటిపై కసరత్తు చేస్తున్నారు. వీటి వల్ల ప్రజా వ్యతిరేకత వుందనే అంచనా ఉన్నా.. హామీల అమలుకు తప్పదని చెబుతున్నారు

## మా హయాంలోనే ఉచిత బస్సు

**ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదం**

**రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు కౌంటర్**



హైదరాబాద్ : విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం నుంచే అమల్లో ఉన్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 'మహాలక్ష్మి' పథకంతో బాలికలు రూపాయి ఖర్చు లేకుండా స్కూలుకు వెళ్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేయగా.. హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ పథకం ద్వారానే బాలికలు పాఠశాలలకు వెళుతున్నట్టు సీఎం గొప్పలు చెప్పడం హాస్యాస్పదం. విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే అమల్లో ఉన్నది. గత ప్రభుత్వ పథకాలను, పనులను కాంగ్రెస్ నేతలు తమ ఖాతాలో వేసుకోవడం శోచనీయం' అంటూ హరీశ్‌రావు ఎక్స్‌లో కౌంటర్ ఇచ్చారు.

## స్థానిక ఎన్నికలు ఇప్పట్లో కష్టమే!

**ఉలుకూపలుకూలేని రాష్ట్ర ప్రభుత్వం**

**హైకోర్టులో జూలై 2న కేసు విచారణ**

**ప్రభుత్వ అఫిడవిట్‌కు కోర్టు ఆదేశం**

**న్యాయస్థానం నిర్ణయమే కీలకం**



హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలా కనిపించటం లేదు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి నుంచి ఎన్నికలపై ఎలాం టి స్పందన లేకపోవటంతో ఈ మధ్య ఎన్నికలు నిర్వహించటం కష్టమేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నా రు. కోర్టు జోక్యం చేసుకొని ఆదేశాలు ఇస్తే తప్ప ఎన్నికలు జరిగేలా లేవని అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు పాలకవర్గాల సమ యం ముగిసింది. వచ్చే నెలలో ఎంపీటీసీ స భ్యులు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుల, జడ్పీ చైర్మన్ల పదవీ కాలం ముగియనున్నది. ఈ నేపథ్యంలో వీటన్నింటికీ వరుసగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. మొన్నటి వరకు ఎన్నికల కోడ్ ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సాధ్యం కాలేదు. కోడ్ ఎత్తేసి వారం గడిచినా కనీస స్థాయిలోనూ ఎన్నికలపై చర్చ జరగటం లేదని అధికారులు, రాజకీయ పార్టీలు చెప్తున్నాయి. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోతే నిధులు కూడా నిలిచిపోతాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వంలో కదలికలేదని వి మర్శిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. బీసీల రిజర్వేషన్‌పై సకాలంలో ప్రభుత్వాలు స్పందించకుంటే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి మిగిలిన సీట్ల అన్నింటినీ జనరల్ క్యాటగిరీ సీట్లుగా పరిగణించి ఎన్నికలు నిర్వహించాలని గతంలోనే సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణ యం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మా రింది. సీఎం ఆదేశాల కోసం బీసీ కమిషన్, పం చాయతీరాజ్‌శాఖ, ఎన్నికల కమిషన్ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల ఓ మంత్రి స్థానిక సంస్థల ఎన్నికల గురించి సీఎంను అడిగినా చూద్దాం అని పొడిపొడి సమాధానం వ చ్చిందని కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసిం ది. మరోవైపు.. సర్పంచ్‌లు లేక గ్రామ పంచాయతీల్లో పాలక పడకేసింది. స్పెషల్ ఆఫీసర్లతో పాలన సాగిస్తున్నారు. ఆర్థిక భారం తాము మోయలేమని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల పనులు ముందుకు సాగటం లేదు.

### కోర్టు తీర్పుపై ఉత్కంఠ

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఇప్పటికే పలువురు వ్యక్తులు, సంఘాలు, అసోసియేషన్లు కోర్టు మెట్లెక్కాయి. ఈ కేసు జనవరి నుంచి కొనసాగుతున్నది. ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలు, ఇతర కారణాలను చూపుతూ వాయిదా కోరుతూ వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలని వేసవి సెలవులకు ముం దే కోర్టు ఆదేశాలు జారీ చేసి, కేసును జూలై 2కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో తిరిగి కేసు జూలై 2న కోర్టు ముందుకు రానున్నది. ప్రభుత్వ అఫిడవిట్, దానిపై కోర్టు జారీ చేసే ఆదేశాలపైనే ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, ఎన్నికల నిర్వహణకు సిద్ధమని ఈసీ ఇప్పటికే అఫిడవిట్ దాఖలు చేసింది.

# ప్రైవేటీకరణ చేస్తారా... ఆపేస్తారా



**విశాఖపట్టణం :** విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను..2021లో అమ్మకానికి పెట్టింది కేంద్రంలోని మోదీ ప్రభుత్వం. ప్లాంట్‌లో 100 శాతం వాటా విక్రయించడంతో పాటు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ నుంచి వైదొలగాలని కేంద్రం నిర్ణయించు కుంది. స్టీల్ ప్లాంట్ మేనేజ్‌మెంట్ బాధ్యతలతో సహా పూర్తిగా ప్రైవేటీకరించాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర నిర్ణయంతో భగ్గుమన్న కార్మిక సంఘాలు, వామపక్షాలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అప్పటినుంచి అలుపెరగని పోరాటాలు చేస్తూనే ఉన్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ అంశంగా కూడా మారింది విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశం. అయితే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కార్మిక సంఘాలు, స్థానికులు వ్యతిరేకిస్తున్నా కూడా ముందడుగే వేసింది కేంద్రం ప్రభుత్వం.అయిదేళ్లుగా విశాఖ ఉక్కు పరిశ్రమ పీకల్లోతు కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. సొంత గనులు లేకపోవడంతో తరచూ ఉత్పత్తికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉద్యోగులు, కార్మికులకు జీతాలివ్వలేని పరిస్థితి కూడా నెలకుంటోంది. అయితే ఇటీవల ఏర్పడిన కేంద్రమంత్రివర్గంలో తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డికి బొగ్గు, గనుల శాఖ మంత్రిగా.. ఏపీకి చెందిన శ్రీనివాసవర్మకు ఉక్కు, భారీ పరిశ్రమల శాఖల సహాయ మంత్రిగా ప్రధాని మోదీ అవకాశమిచ్చారు. దీంతో స్టీల్‌ప్లాంట్‌పై ఏపీ ప్రజల్లో మళ్లీ ఆశలు మొదలయ్యాయి. అప్పుల భారంతో కుంగిపోతోన్న ఉక్కు పరిశ్రమకు బొగ్గు గనులు కేటాయిస్తే?కష్టాలు తొలగే అవకాశముందని ప్లాంటు ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ మెడ మీద బీజేపీ కత్తి పెట్టి మూడేళ్లుగా బలహీనం చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం పూర్తి స్థాయి ఉత్పత్తి జరగడం లేదు. అందుకు అవసరమైన నిధులు, ముడిపదార్థాలు లేవు. ఇక్కడ ఏడాదికి 80 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా 50 వేల కోట్ల ఆదాయం వస్తుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్‌టీ ద్వారా 18 శాతం అంటే రూ.9 వేల కోట్లు ఆదాయం వస్తుంది. అయితే ఇవన్నీ జరగాలంటే స్టీల్ ప్లాంటు నిర్వహణకు అవసరమైన నిర్వహణ మూలధనం సమకూర్చాలి. బ్యాంకుల నుంచి రుణం దొరకాలంటే.. రాష్ట్రపతి పేరిట ఉన్న ఉక్కు భూములను ఆర్ఐఎన్ఎల్ పేరిట మార్పించాలి. అప్పుడే సంస్థకు ఆర్థిక పరపతి పెరిగి మార్కెట్‌లో రుణాలు లభిస్తాయి. ఇపుడు సరైన సమయం వచ్చింది కాబట్టి బీజేపీ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా చేయాలని అధికార, కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయంపై కేంద్రంతో మాట్లాడతానన్నారు..ఉక్కు శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసవర్మ. స్టీల్ ప్లాంట్ ఏపీ ప్రజలకు సెంటిమెంట్ అన్న ఆయన.. ప్రైవేటీకరణ ఆపేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. ప్రజలకు మేలు జరిగేలా అడుగులు వేస్తానని హామీ ఇచ్చారు.కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి ఊపిరి అందిస్తున్న టీడీపీ..స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రకటన విడుదల చేయించాలని పలు వర్గాలు కోరుతున్నాయి. కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతుందని నమ్మకంతో స్థానికులు భారీ విజయాన్ని అందించారని.. ఆ నమ్మకాన్ని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర విభజన హామీలైన కడప, బయ్యారం స్టీల్‌ప్లాంట్‌ల ఏర్పాటు హామీలపై కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నారు.

# చిరూ పవర్ చూపించిన పవన్



**విజయవాడ :** గత ఐదు సంవత్సరాలుగా విధ్వంసకర పాలన సాగించారు జగన్. 151 సీట్లతో గెలిచేసరికి విజయ గర్వంతో ఊగిపోయారు. తన ప్రతి నిర్ణయానికి ప్రజలు స్వాగతిస్తారని భావించారు. తన మాటకు ఎదురు తిరగరని అంచనా వేశారు. అమరావతి ఏకైక రాజధానికి అందరూ ఆమోద ముద్ర వేస్తే.. తాను మాత్రం మూడు రాజధానులు అంటూ విభిన్నంగా ఆలోచించారు.అందుకే 166 నియోజకవర్గాలకు చెందిన ప్రజలు అమరావతికి జై కొట్టారు. మూడు రాజధానులు వద్దు అంటూ తేల్చి చెప్పారు. చివరకు రాజధాని ఇస్తామన్న ఉత్తరాంధ్ర ప్రజల సైతం తిరస్కరించారు. విశాఖ నగరవాసులు కనీసం ఆహ్వానించలేదు. పైగా భారీ ఓటమితో బదులు చెప్పారు.అధికారంలో ఉండగా అన్ని అనుకూలతలు కనిపిస్తాయి. ప్రధాని మోదీ ఆహ్వానిస్తారు. అవకాశం ఇచ్చారు. కుర్చీలెక్కి చర్చించారు. చాలా రకాల మినహాయింపులు ఇచ్చారు. అది ఒక దేశ పాలకుడిగా.. ప్రతి రాష్ట్ర పాలకుడికి ఇచ్చే మినహాయింపు. కానీ తనకు రాష్ట్రంలో తిరుగులేదు.. జాతీయస్థాయిలో ఎదురు లేదు అన్నట్టు భావించారు. కానీ అన్నింటికీ సమాధానం ఇచ్చారు ఏపీ ప్రజలు. పవన్ అయితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయ్యేలా జగన్కు దీటైన బదులిచ్చారు. అటు పదేళ్ల అభిమానుల నిరీక్షణకు అసలుసిసలు ఫలితం ఇచ్చారు.అదే సమయంలో చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అదే చిరంజీవిని జగన్ అవమానించిన తీరుకు గట్టిగానే బదులిచ్చారు పవన్.చంద్రబాబు తో పాటు పవన్ ను ఆశీర్వదించారు ప్రధాని మోదీ. వారికి శుభాకాంక్షలు చెబుతున్న క్రమంలోనే తన అన్న చిరంజీవి ప్రస్తావని తీసుకొచ్చారు పవన్.మోదీ సైతం ఒక వైపు పవన్ ను, మరోవైపు చిరంజీవిని పక్కన పెట్టుకుని కూటమి విజయ గర్వాన్ని అనుభవించారు. చిరంజీవి స్థాయి ఏమిటో, ఆయన స్థానం ఎక్కడుందో తేల్చి వచ్చేలా చేశారు పవన్. నలుగురు మధ్య చిరంజీవికి చేసిన అవమానాన్ని.. కోట్లాదిమంది సాక్షిగా బదులిచ్చారు పవన్. సినీ పరిశ్రమ సమస్యలపై పెద్దన్న పాత్ర పోషిస్తూ చిరంజీవి జగన్ ను కలిసిన సంగతి తెలిసిందే. నాడు అధికార మదంతో జగన్ వ్యవహరించిన తీరు, అధ్యక్ష కెమెరాల్లో బంధించి మరి సోషల్ మీడియాలో విడుదల చేశారు. దీంతో లక్షలాదిమంది మెగా అభిమానులు హర్ట్ అయ్యారు. అందుకే ఇప్పుడు పవన్ రివెంజ్ తీర్చుకున్నారు. అటు కుటుంబ విలువలను సైతం జగన్ కు తెలియజెప్పారు పవన్. ఓటమితో కష్టంలో ఉన్నప్పుడు అవమానాలను తాను ఒక్కడినే భరించాడు పవన్. కానీతనకు దక్కిన విజయం,గౌరవంలో మాత్రం అన్న చిరంజీవికి వాటా ఇచ్చాడు. అసలు కుటుంబ విలువలు అంటే ఇవి కదా జగన్ అని సోషల్ మీడియాలో ప్రశ్నలు, నిలదీతలు ఎదురయ్యేలా చేశాడు పవన్.

**అన్నదమ్ముల అనుబంధం**

అయితే ఈ అరుదైన దృశ్యాన్ని చూసి పులకించుకుపోయిన చిరంజీవి.. తమ్ముడి బుగ్గలను నిమురుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతే ఆనందంతో ప్రధాని మోదీ కనిపించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ కొన్ని వ్యాఖ్యలు చేస్తూ కనిపించారు. దీనిపై నెటిజన్లు రకరకాలుగా ఊహించుకొనగా.. మెగాస్టార్ చిరంజీవి ఆ విషయంపై క్లారిటీ ఇచ్చారు. ప్రధాని మోదీ ఆ సమయంలో ఏమన్నారోసోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'నాతో, తమ్ముడితో ప్రధాని నరేంద్ర మోదీ గారు వేదికపై మాట్లాడడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఎన్నికల ఫలితాల తర్వాత పవన్ ఇంటికి వచ్చినప్పటి వీడియోను ఆయన చూసినట్టు చెప్పారు. కుటుంబ సభ్యులు, ప్రత్యేకించి మా అన్నదమ్ముల మధ్య ఉన్న ప్రేమ అనుబంధాలను ఆ వీడియోలో కనిపించాయని అన్నారు. ఆ దృశ్యాలు మన సంస్కృతి సాంప్రదాయాన్ని, కుటుంబ విలువలను ప్రతిబింబించాయని అభినందించారు. ఆ క్షణాలు ప్రతి అన్నదమ్ముళ్లకి ఆదర్శంగా నిలుస్తాయి అన్నారు. ప్రధాని మాతో అలా మాట్లాడడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. వారి సునిశిత దృష్టికి నా కృతజ్ఞతలు. తమ్ముడి స్వాగతం లాగే మోదీతో జరిగిన మా సంభాషణ కూడా కలకాలం గుర్తుండిపోయే ఓ అపురూప జ్ఞాపకం'అంటూ చిరంజీవి పేర్కొన్నారు.ప్రధాని మోదీతో చిరంజీవి క్రేజ్ గా గడపడం ఇదే కొత్త కాదు. భీమవరంలో అల్లూరి విగ్రహావిష్కరణ సమయంలో మోదీ హాజరయ్యారు. ఆ సమయంలో మెగాస్టార్ చిరంజీవికి సైతం ప్రత్యేక ఆహ్వానం వచ్చింది. అప్పుడు సీఎం గా జగన్ ఉన్నారు. ఆయన సైతం అదే వేదికపై ఉన్నారు. కానీ ప్రధాని మోదీ మాత్రం చిరంజీవితోనే చనువుగా గడిపారు. ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. పవన్ విషయంలో సైతం చనువుగా వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ సోదరులు ఇద్దరు ఒకే వేదికపై ఉండడం, ఆనందోత్సవాలు జరుపుకోవడం చూసి ప్రధాని మోదీ పరవశించిపోయారు. ఆ ఇద్దరు సోదరులతో ఎంతో ఆనందాన్ని పంచుకున్నారు. ఆ వీడియోలే ఇప్పుడు సోషల్ మీడియాలో ఎక్కువగా దర్శనమిస్తున్నాయి.

# ప్రమాణల వేళ....అనుబంధాల కోవెల...



**విజయవాడ :** ఏపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారం లో బలమైన బంధాలు, భావోద్వేగాలు వెలుగు చూశాయి. సమాజానికి అవసరమైన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. నందమూరి, నారా, కొణిదెల కుటుంబాలు బలమైన ముద్రను చాటుకున్నాయి. తమ మధ్య ఉన్న కుటుంబ అనుబంధాలు, ఆప్యాయతలను ప్రతిబింబించాయి. సామాన్య ప్రజలను సైతం ఆలోచింపజేశాయి. అందరినీ దూరం చేసుకుంటూ జగన్ అపజయాన్ని మూట కట్టుకోగా.. అందర్నీ కలుపుకొని, అన్ని కుటుంబాలు ఏకమై విజయాన్ని అందుకున్నాయి. విజయాన్ని ఆస్వాదించాయి. ప్రమాణ స్వీకారం మహోత్సవం ఆసాంతం కుటుంబ విలువలు తెలిపేలా దృశ్యాలు కనిపించాయి. ప్రమాణ స్వీకార వేదిక పైకి వచ్చిన నారా భువనేశ్వరిని సోదరుడు నందమూరి బాలకృష్ణ నుదుటిపై ముద్దు పెట్టి తనలో ఉన్న ఆప్యాయతను చూపించారు. అన్న దీవెనలను ఆమె సంతోషంగా స్వీకరించారు. దానిని ప్రతి ఒక్కరూ చూసి సంతోషించారు. చంద్రబాబు, నారా లోకేష్ ప్రమాణ స్వీకారం చేస్తున్నప్పుడు.. కుటుంబ సభ్యుల ఆనందాలకు అవధులు లేవు. నారా బ్రాహ్మణి, ఆమె కుమారుడు దేవాన్ష్ లేచి సందడి చేశారు. వెనుకనే కూర్చుని ఉన్న నందమూరి రామకృష్ణ, సూపర్ స్టార్ కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు.పవన్ కళ్యాణ్ అను నేను అని జనసేన అధినేత ప్రమాణ స్వీకారం చేసే సమయంలో జనసైనికుల సందడి అంతా ఇంతా కాదు. బాహుబలి సినిమాలో ప్రభాస్ పట్టాభిషిక్తుడు అయినప్పుడు వచ్చిన వైబ్రేషన్ కేసరపల్లిలో వినిపించాయి. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పవన్ చంద్రబాబు, నరేంద్ర మోడీ వద్దకు వెళ్లి వారికి పాదాభివందనం చేయబోయారు. కానీ వారు వద్దని వారించారు. అక్కడకు కొద్ది దూరంలో ఉన్న చిరంజీవిని పాదాభివందనం చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు పవన్. ఆ సమయంలో మెగా కుటుంబం భావోద్వేగానికి గురైంది. చప్పట్లతో ఆహ్వానించింది. ప్రమాణ స్వీకార అనంతరం ప్రధాని మోదీ మెగా బ్రదర్స్ కు ఇచ్చిన గౌరవానికి అంతా ఫిదా అయ్యారు. అయితే ఈ కార్యక్రమంలో వెలుగు చూసిన కుటుంబ విలువలు, బలమైన బంధాలు చూసి ఎన్నెన్నో ఆలోచనలు బయటకు వచ్చాయి. ముఖ్యంగా జగన్ కుటుంబ సభ్యులకు వ్యవహరించిన తీరు చర్చకు వచ్చింది. షర్మిల విషయంలో జగన్ వ్యవహరించిన తీరు, భువనేశ్వరి విషయంలో బాలకృష్ణ వ్యవహరించిన తీరును ఎక్కువమంది సరిపోల్చుకున్నారు. జగన్ వైఖరిని తప్పుపట్టారు.

## ఆరేళ్ల బాలికపై అత్యాచారం..

**పెద్దపల్లి :** సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో దారుణం జరిగింది. రైస్ మిల్లులో డ్రైవర్గా పనిచేసే బలరాం అనే వ్యక్తి ఓ ఆరేళ్ల బాలికను అత్యాచారం చేసి హత్య చేశాడు. రైస్ మిల్లులో తల్లితో పాటు నిద్రిస్తున్న బాలికను సమీప పొదల్లోకి ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. అతడు బాలికను ఎత్తుకెళ్తున్న దృశ్యాలు సిసిటివి కెమెరాలో రికార్డు అయ్యాయి. తల్లిదండ్రులు, కార్మికులు నిందితుణ్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

## కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల తీరు బాధించింది

**అమరావతి :** సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం సచివాలయంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అయన కీలక వ్యాఖ్యలు చేసారు. గడచిన 5 ఏళ్లలో కొందరు ఐఏఎస్ ల తీరు చాలా బాధించింది. ఐఏఎస్, ఐపీఎస్ లు ఇలా వ్యవహరిస్తారని ఎప్పుడూ అనుకోలేదు. 1995 నుంచి పలు దఫాలుగా సీఎంగా ఉన్నా. ఇలాంటి పరిస్థితి నేను ఎప్పుడూ చూడలేదు. గడచిన 5ఏళ్లలో వ్యవహరించిన తీరుపై ఐఏఎస్, ఐపీఎస్ లు ఆత్మ సమీక్ష చేసుకోవాలి. మరోసారి శాఖల వారీగా ఐఏఎస్, ఐపీఎస్ లతో సమావేశం అవుతా అని అన్నారు. ప్రవీణ్ ప్రకాష్, శ్రీ లక్ష్మి, పి ఎస్సార్ ఆంజనేయులు ఇచ్చిన పుష్పగుచ్ఛాలను చంద్రబాబు తిరస్కరించారు.

## రంగారెడ్డి జిల్లాలో

## 34 స్కూలు బస్సులపై కేసులు నమోదు

**రంగారెడ్డి :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఫిట్ నెస్ లేని 34 విద్యాసంస్థల బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ వెల్లడించారు. విద్యా సంస్థల బస్సులపై మూడవ రోజు ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా వ్యాప్తం గా రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫిట్ నెస్ లేని, పన్నులు చెల్లించని 34 బస్సులపై కేసు నమోదు చేయడం జరిగిందని అయన అన్నారు. ఈ రోజు 4 బృందాలు గా ఏర్పడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తం గా రవాణా శాఖ అధికారులు తనిఖీ లు చేపట్టారు. ఈ సందర్భం గా డి టి సి చంద్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఫిట్ నెస్ లేని,15 సంవత్సరాలు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితులలో రోడ్ల పైకి తిప్పరాదని తెలిపారు. అనుభవం గల , 60 సంవత్సరాలు మించని డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. ఈ తనిఖీ లు కొనసాగుతాయని , ప్రతీ విద్యా సంస్థ బస్సు తప్పనిసరిగా సంబంధిత రవాణా శాఖ కార్యాలయం లో ఫి ట్ నెస్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు.ఈ దాడులలో రంగారెడ్డి, మేడ్చల్, ఉప్పల్ రవాణా శాఖ అధికారులు కిరణ్ రెడ్డి, కృష్ణ వేణి, సునీత, నవీన్, ఉపాసిని, ప్రతాప్ రాజా, త్రివేణి, శ్రీనివాస్ ,ఒనిబీబష్రజీ తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు ఎంఈవో కార్యాలయానకి వాపస్

**నల్గొండ :** ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలను తిరిగి ఎంఈఓ కార్యాలయాలకు తరలించారు. ఆయా పాఠ్యపుస్తకాలలో ముందుమాట గత ప్రభుత్వంలో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేరు మీద ఉండడంతో పెద్ద ఎత్తున వివాదాలు వచ్చాయి. దీంతో ఆయా పాఠ్యపుస్తకాల్లో ముందుమాట పేజీ మీద ప్రస్తుత ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి పేరు మీద ముందుమాట స్టిక్కర్ అతికించి తిరిగి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 1,483 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,126 ప్రాథమిక, 128 ప్రాథమికోన్నత, 229 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 1,54,301మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో 715 ప్రాథమిక పాఠశాలలు, 181 ఉన్నత పాఠశాలలు, 349 ఉన్నత పాఠశాలలు.. 33 ఉన్నత పాఠశాలలు పనిచేస్తున్నాయి. 1,36,855 మంది విద్యార్థులు ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,27,633మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. జిల్లాలో మొత్తం 3,465 మంది ఉపాధ్యాయులు 2,800 మంది ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

## సీతనపల్లి ప్రమాదస్థలిని పరిశీలించిన ఎస్పీ

**విజయవాడ :** శుక్రవారం తెల్లవారుజామున కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సమాచారాన్ని తెలుసుకొని కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఐపీఎస్ గారు వెనువెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన వాహనాలను, ప్రమాదానికి దారి తీసిన కారణాలను ప్రమాద సమాచారాన్ని అక్కడ పోలీసు అధికారులను అడిగి తెలుసుకుని రహదారి ప్రమాదం పట్లగ్భ్రాంతి వ్యక్తపరిచారు.

## కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద

## ఘోర రోడ్డు ప్రమాదం

**ఆరుగురు మృతి.. పలువురికి గాయాలు**

**విజయవాడ :** కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఒక కంటైనర్ పాండిచ్చేరి నుండి భీమవరం రొయ్యల ఫీడ్ తీసుకువెళ్తుంది.ఎదురుగా బోలెరో వ్యాన్ అమలాపురం అంబేద్కర్ కోనసీమ జిల్లా తాళ్లరేవు నుండి కృత్తివెన్ను మండలం మునిపెద వస్తుంది. శీతనపల్లి వద్ద పుల్లల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ను ఢీకొని ఓవర్ టాక్ చేస్తూ కంటైనర్ ను ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో అక్కడికక్కడే ఐదుగురు మృతి చెందగా గాయపడిన మరో ఆరుగురిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలిస్తుండగా మరొక వ్యక్తి మృతి చెందారు. ఐదుగురు పరిస్థితి విషమంగా వుంది. తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రమాదం చోటు చేసుకోవడంతో రెండు మూడు కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్ నిలిచిపోయింది.

## రక్త దానం గొప్ప దార్శనికత

**హైదరాబాద్ :** రాజ్ భవన్ ఐ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 20 వ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా రాజ్ భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో బ్లడ్ డోనేషన్ క్యాంప్ కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై బ్లడ్ డోనేషన్ క్యాంప్ ను ప్రారంభించారు. తరువాత బ్లడ్ డో నెట్ చేసిన దాతలకు సర్టిఫికెట్ లు అందచేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ , జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కర్ ,రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా ఐఎఎస్,రాజ్ భవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ,హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తూ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్,రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సీఈఓ మదన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు. రక్త దానం గొప్ప కార్యక్రమం. మన శరీరం నుండి రక్తదానం ఇవ్వడం గొప్ప దార్శనికత. రక్త దానం చేస్తే ఏదో జరుగుతుందనే అపోహ విడాలి. పెరుగుతున్న సైన్స్ నాలెడ్జ్ అవగాహన కలుగుతుందని అన్నారు. మూడు నెలలకు ఒకసారి రక్తదానం ఇవ్వచ్చు అని అందరికీ తెలిసిపోయింది. ఒక్కొక్కరు 50,60 సార్లు రక్త దానం చేయడం గొప్ప నిర్ణయం వారికి మరింత మంచి జరుగుతుంది. విద్యార్థి దశ లో ఉన్నప్పటి నుండి ప్రత్యేకమైన రోజుల్లో రక్తదానం చేసేది . రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ లు పరిమితంగా ఉన్నాయి. కొత్త జిల్లాలు పెరిగాయి, రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయి. 100 బెడ్స్ ఉన్న ప్రతి హాస్పిటల్ కి ఒక బ్లడ్ బ్యాంక్ ఉండేలా చూస్తే ఇబ్బందులు ఉండవు. దాని వల్ల అవగాహన పెరిగి దాతలు ఎక్కువగా వస్తుంటారు. ప్రభుత్వం తరుపున ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా,ముఖ్యమంత్రి తో మాట్లాడి ప్రతి జిల్లా హాస్పిటల్ లు 100 బెడ్స్ హాస్పిటల్ లో బ్లడ్ బ్యాంక్ ఏర్పడేలా మాట్లాడతా. రెడ్ క్రాస్ వాహనాలకు రవాణా శాఖ తరుపున వారికి పన్నులు మినహాయింపు ఇవ్వడమా అనేది నిర్ణయం తీసుకుంటాం. తలసేమియా వ్యాధి గ్రస్తులకు బస్ పాస్ అడుగుతున్నారు..పర్యిస్తాం. రక్త దానం గొప్ప కార్యక్రమం..ప్రపంచ రక్త దాన దినోత్సవం సదర్భంగా ఈ కార్యక్రమం లో పాల్గొనడం శుభపరిణామం. అరుదుగా దొరికే బ్లడ్ దొరికే వారి సమాచారం రెడ్ క్రాస్ సొసైటీ వారి వద్ద ఉండాలి.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com